
సాక్షి
ఒడిశా

గురువారం । 17 । అక్టోబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,28,580లు, బంగారం 450 మిల్లీగ్రాములు వెండి50 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



కన్న తండ్రే కాలయముడు

కుమార్తెను కన్న తండ్రే హత్య చేసిన ఘటన దోరగూడ పంచాయతీ ఆర్‌ఎస్‌సీ-14 గ్రామంలో చోటుచేసుకుంది. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

- 8లో.



పాముకాటుతో బాలిక మృతి

కలిమెల సమితి పేరుబే గ్రామంలో 12 ఏళ్ల బాలిక పాముకాటుతో మృతి చెందింది. మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది.

- 8లో.

న్యూస్‌రీల్

హర్యానా వెళ్లనున్న ముఖ్యమంత్రి

భువనేశ్వర్: హర్యానాలో కొలువుదీరనున్న బీజేపీ కొత్త మంత్రి మండలి ప్రమాణ స్వీకారోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి హాజరు కానున్నారు. ఛండీగఢ్‌లో ఈ కార్యక్రమం గురువారం జరగనుంది. అదే రోజున జరగనున్న ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో మోహన్ చరణ్ మాఝి పాల్గొంటారు.

ముంబైకి పయనం

ముంబైలో జరగనున్న రెండు రోజుల పెట్టుబడిదారుల సమావేశానికి ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి హాజరు కానున్నారు. హర్యానా ఛండీగఢ్‌లో కార్యక్రమాలు ముగించుకుని ముంబైకి బయల్దేరుతారు. ఈ నెల 18, 19 తేదీల్లో పెట్టుబడిదారుల సమావేశం జరుగుతుంది. తిరిగి ఈ నెల 19వ తేదీ సాయంత్రం రాష్ట్రానికి చేరుతారని ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాల సమాచారం.

ప్రారంభమైన అయ్యప్ప మండల దీక్షలు



మాలాధారణ చేయిస్తున్న వేద పండితుడు పూలఖండం నాగేశ్వరశర్మ

కొరాపుట్: అయ్యప్పస్వామి మండల దీక్షలు ప్రారంభమయ్యాయి. బుధవారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని రాజువీధి ఉన్న గణేష్ మందిరం ఆవరణలో అయ్యప్ప విగ్రహం వద్ద ప్రముఖ వేద పండితుడు పూల ఖండం నాగేశ్వర్‌శర్మ స్వాములకు మాలాధారణ చేశారు. మరో వైపు నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాంలో జయపూర్‌కు చెందిన రమణ గురుస్వామి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున స్వాములు మాలాధారణ చేశారు. వీరు 41 రోజుల మండల దీక్ష ముగించుకొని శబరిమలలో నవంబర్ 16 తర్వాత తెరిచే అయ్యప్ప దేవాలయంలో తొలి మండల దీక్ష విరమిస్తారు.

దుండగుడి దుశ్చర్య



కాలిపోయిన బైక్, వస్తువులు

రాయగడ: ఇంటి బయట పార్కింగ్ చేసిన బైకును గుర్తు తెలియని దుండగుడు తగులబెట్టాడు. జిల్లాలోని అంబొదలలో మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబొదలలోని గజేంద్ర రౌణ ఇంటి బయట సిగిడి వద్ద బైకును పార్కింగ్ చేశాడు. గుర్తు తెలియని దుండగుడు వచ్చి బైకుకు నిప్పు పెట్టాడు. దీంతో మంటలు చెలరేగడంతో అక్కడే ఉన్న గ్యాస్ సిలిండర్, విద్యుత్ మీటరు తదితర వస్తువులు కాలిపోయాయి. దట్టమైన పొగ కమ్ముకోవడంతో బాధితులు నిద్రలేచి బయటకు పరుగులు తీశారు. ఈ వివరాలు సీసీ కెమెరాలో నిక్షిప్తమవ్వగా పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

మిల్లులను మూసివేయండి



కలెక్టర్‌ను కలిసిన జింజిలిబడి గ్రామస్తులు

రాయగడ: కొలనార సమితి జంజిలిబడి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ధాన్యం, పత్తి మిల్లులను మూసివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేసారు. ఈ మేరకు కలెక్టర్ ఫరూల్ పట్వారిని కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే గ్రామంలో పత్తి, ధాన్యం మిల్లులు ఎక్కువయ్యాయని, వీటి వల్ల కాలుష్యం పెరిగి పంట పొలాలకు నష్టం వాటిల్లుతోందని, పర్యావరణం దెబ్బతింటోందని చెప్పారు. ఇదే విషయమై ఈ నెల 7న కలెక్టర్ నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఇంతవరకు ఎటువంటి చర్యలు చేపట్టకలేదని వివరించారు.



గజగజ

గజరాజులు హల్‌చల్ సృష్టిస్తున్నాయి. అడవినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న ఆదివాసీ గిరిజనులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పచ్చని పంట పొలాలను నాశనం చేస్తున్నాయి. జీవనోపాధికి తీరని నష్టం కలిగిస్తున్నాయి. అధికారులు తమవంతు ప్రయత్నాలు చేస్తూ ఏనుగులను తరిమేసే ప్రయత్నం చేస్తున్నా కొన్నాళ్లకు మళ్లీ తిరిగి వచ్చేస్తుండటంతో స్థానికులు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు.

ఇంపా కర్మాగారం వెనుక ఏనుగుల సంచారం

- మళ్లీ మొదలైన ఏనుగుల బీభత్సం
- రాయగడ జిల్లాలో అధిక నష్టం
- ఆందోళనలో గిరిజనం

రాయగడ : జిల్లాలో ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఇటు గ్రామస్తులకు, అటు అటవీ శాఖ అధికారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పచ్చని పంటపొలాలతో పాటు కాయగూరల పంటలను సైతం ధ్వంసం చేస్తూ రైతులకు కన్నీరు మిగులుస్తున్నాయి. జిల్లాలోని గుణుపూర్, గుడారి, మునిగుడ, చంద్రపూర్ సమితుల్లో వీటి అలజడి ఎక్కువగా ఉంది. పొరుగు రాష్ట్రానికి చెందిన శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల పరిసర ప్రాంతాలకు చెందిన అటవీ ప్రాంతం నుంచి జిల్లాలోకి చొరబడుతున్నట్లు అటవీ అధికారులు చెబుతున్నారు. ఆహారాన్ని వెతుక్కుంటూ కంటికి కనిపించినవన్నీ ధ్వంసం చేస్తున్నాయి. అటవీ శాఖ అధికారులు అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నా ఫలితం లేకపోతోంది.

తగ్గుముఖం పట్టినా..

1979 గణంకాల ప్రకారం రాయగడ జిల్లాలోని సమీప అడవుల్లో సుమారు 102 ఏనుగులు సంచరిస్తున్నట్లు సమాచారం. రానురాను వీటి సంఖ్య తగ్గుముఖం పడుతోంది. ఇందులో 94 ఏనుగుల ఆచూకీ కనిపించకపోగా ప్రస్తుతం ఎనిమిది ఏనుగులు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. మిగతా ఏనుగులు మాత్రం ఇతర ప్రాంతాల నుంచి ఆహారాన్ని వెతుక్కుంటూ వస్తున్నాయని అంటున్నారు.



పంటపొలాలను ధ్వంసం చేసిన దృశ్యం



విద్యుత్ ఘాతంతో మృతి చెందిన ఏనుగులు(ఫైల్)

గత సంఘటనలు పరిశీలిస్తే..

- కొద్ది నెలల కిందట గుణుపూర్‌లోని గట్లొపాదొరొ, పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లోని భామిని అటవీ ప్రాంతంలో విద్యుత్ ఘాతానికి గురై నాలుగు ఏనుగులు మృతి చెందాయి. గుంపులో ఉన్న రెండు ఏనుగులు కొండపైకి వెళ్లి పోయినట్లు సమాచారం.
- జిల్లాలోని కళ్యాణసింగుపూర్ సమితిలో రెండు నెలల క్రితం రెండు ఏనుగు దంతాలతో ఇద్దరు నిందితులు పట్టుబడ్డారు. అటవీ శాఖ అధికారులు వీరిని పట్టుకుని విచారించగా కళ్యాణసింగుపూర్ సమీప అడవుల్లో ఒక ఏనుగు మృతి చెందగా దానిని గోతిలో పాతిపెట్టినట్లు అంగీకరించారు. దీంతో ఆ ప్రాంతానికి వెళ్లిన అటవీ శాఖ అధికారులు ఏనుగు కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు.
- గత ఏడాది మే నెలలో కళ్యాణసింగుపూర్ సమితి పరిధిలో బరియపొడ, సికరపాయి, సారథి, గుర్తిబెడ వంటి గ్రామాల్లో ఏనుగులు బీభత్సాన్ని సష్టించాయి. పలువురి ఇళ్లను ధ్వంసం చేశాయి. మామిడి, అరటి, కొబ్బరి తోటలు, కూరగాయల పంటలను నాశనం చేశాయి.
- శారధి గ్రామంలో సోలార్ విద్యుత్‌కు సంబంధించిన ప్యానల్, గొట్టపుబావిని ధ్వంసం చేశాయి.
- మనిగుడ సమితిలో రెండు ఏనుగులు వరి, పత్తి పంటలను నాశనం చేశాయి.
- రెండేళ్ల క్రితం గుణుపూర్‌లోని చెంపాపూర్ గ్రామంలో చొరబడి ఇళ్లను ధ్వంసం చేయగా భయాందోళనకు గురైన గ్రామస్తులు ఇళ్లను విడిచి అడవులకు పారిపోయి తలదాచుకున్నారు. ఆ సమయంలో ఏనుగులు ఇళ్లలోకి చొరబడి సామగ్రిని, ఆహారాన్ని ధ్వంసం చేశాయి.
- రెండు నెలల క్రితం జిల్లా కేంద్రానికి సుమారు 25 కిలోమీటర్ల దూరంలోని తెరువలి వద్ద ఏనుగులు విధ్వంసం సృష్టించాయి. ఆరు ఏనుగులు ఫ్యాక్టరీ వెనుక సంచరిస్తూ స్థానికులను వణికించాయి.
- ఒడిశా, ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన కెరడ కూనేరు మధ్య ఇటీవల ఓ ఏనుగు జనావాసాల మధ్యకు వచ్చి హల్‌చల్ సృష్టించింది. పార్వతీపురం నుంచి కళ్యాణసింగుపూర్ వైపు వెళ్లే ప్రయివేట్ బస్సుపై దాడి చేసి అద్దాలను పగులగొట్టింది. ప్రయాణికులు సకాలంలో స్పందించి సురక్షితంగా బయటపడ్డారు.
- గుణుపూర్‌లోని ఒకీలుగుడ, కరణగుడ గ్రామాల్లోకి ఏనుగులు చొరబడి పంటపొలాలను, కాయగూరల పంటలను ధ్వంసం చేశాయి.



మృతిచెందిన ఏనుగులను చూసేందుకు వచ్చిన జనాలు(ఫైల్)



స్వాధీనం చేసుకున్న ఏనుగు దంతాలు(ఫైల్)



కరణంగుడలో అటవీ శాఖ అధికారులు



ఒకీలుగుడలో మంగళవారం కనిపించిన ఏనుగు

రాష్ట్రానికి రానున్న రాష్ట్రపతి



ద్రౌపది ముర్ము

భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్ర పర్యటనకు విచ్చేయనున్నారు. ఆమె మూడు రోజులపాటు పర్యటనలో పాల్గొంటారు. స్వగ్రామస్తులతో సమావేశం, పూరీ జగన్నాథుని దర్శనం, పూరీ గోపబంధు ఆయుర్వేద కళాశాల వజ్రోత్సవాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొంటారని స్థానిక ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి రాష్ట్రపతి పర్యటన కార్యక్రమాల ఏర్పాట్లు, భద్రతా, వసతి తదితర అంశాల్ని అనుబంధ అధికార వర్గాలతో సమీక్షిస్తున్నారు. ఈ నెల 23 నుంచి రాష్ట్రపతి రాష్ట్ర పర్యటన ఆరంభం అవుతుంది. పశ్చిమ బెంగాల్ కలైకొండ విమానాశ్రయం నుంచి ప్రత్యేక వాయుసేన విమానంలో మయూర్‌భంజ్ జిల్లా బంగిరిపొషి ప్రాంతం హెలిప్యాడ్‌కు ఉదయం 9.55 గంటలకు చేరుతారు. తొలి రోజున ద్రౌపది ముర్ము స్వగ్రామం సందర్శిస్తారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ముఖాముఖి చర్చలో పాల్గొంటారు. అనంతరం పలు కార్యక్రమాల్లో పాల్గొని పలు రైల్వే ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. మయూర్‌భంజ్ జిల్లాలో వర్చువల్‌గా మరి కొన్ని కార్యక్రమాల్లో రాష్ట్రపతి పాలుపంచుకుంటారు. అనంతరం భువనేశ్వర్ చేరి రాత్రి బస చేస్తారు. మరుసటి రోజు ఉదయం పూరీకి బయల్దేరుతారు. ఈ మేరకు పూరీ జిల్లా యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా కలెక్టర్ ఈ కార్యకలాపాల్ని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. 24వ తేదీ ఉదయం 10.45 గంటల సమయానికి పూరీ తలొబొణియా ప్రాంతంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు రాష్ట్రపతి చేరుతారు. అక్కడి నుంచి నేరుగా శ్రీమందిరం సందర్శిస్తారు. శ్రీ మందిరంలో మూల విరాట్‌ల సన్నిధిలో పూజాదుల్లో పాలుపంచుకుంటారు. సుమారు అర గంట సేపు అక్కడే ఉంటారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు పూరీ గోపబంధు ఆయుర్వేద కళాశాల వజ్రోత్సవాల్లో పాల్గొంటారు. అనంతరం పూరీ రాజ్ భవన్‌లో విశ్రమిస్తారు. సాయంత్రం బయల్దేరి భువనేశ్వర్ చేరుతారు. అక్కడి నుంచి తిరుగు ప్రయాణమవుతారు.

భార్యను నరికిన భర్త

భువనేశ్వర్: పూరీ జిల్లా బ్రహ్మగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుసుబెంటి గ్రామంలో భార్యను కత్తితో నరికిన ఘటన తీవ్ర కలకలం రేపింది. కుటుంబ కలహాలతో ఈ ఘటన చోటు చేసుకుందని స్థానికులు చెబుతున్నారు. భార్యతో పాటు మరో బంధువుని కూడా నిందితుడు నరికినట్లు సమాచారం. ఇంట్లో నుంచి కేకలు వినిపించడంతో ఇరుగుపొరుగు వారు చేరుకుని బాధితుల్ని స్థానిక ఆస్పత్రికి తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. బాధితుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. నిందితుడు గుండిచా ప్రధాన్‌గా గుర్తించారు.

చెట్టు నుంచి పడి వ్యక్తి మృతి



రామారావు మృతదేహం

మల్కన్‌గిరి: కట్టెల కోసం చెట్టు ఎక్కిన వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి చిత్రంగపల్లి గ్రామంలో చోటుచేసుకోగా.. రామారావు దొర (45) మృత్యువాత పడ్డాడు. చిత్రంగపల్లి గ్రామానికి చెందిన రామారావు దొర సమీప అడవిలోకి మంగళవారం సాయంత్రం కట్టెల కోసం వెళ్లాడు. అయితే చీకటిపడుతున్నా తండ్రి ఇంటికి రాకపోవడంతో కుమారుడు శాంతరావు అడవిలోకి వెళ్లి చూడగా..చెట్టు పైనుంచి కిందపడిపోయి తీవ్రంగా గాయపడి ఉండటాన్ని గమనించారు. వెంటనే జాన్‌బాయి మెడికాల్ సెంటర్‌కు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం రామారావు ప్రాణాలు కోల్పోయాడు. శాంతారావు ఫిర్యాదు మేరకు చిత్రకొండ పోలీసులు కేసు నమోదు చేసి.. రామారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించామని చిత్రకొండ ఐఐసీ ముకుందో మేల్క తెలిపారు.

నిందితులకు నార్కో పరీక్షలు పూర్తి

భువనేశ్వర్: రాష్ట్రంలో తీవ్ర సంచలనం రేపిన స్థానిక భరతపూర్ పోలీస్‌స్టేషన్ వివాదం కేసు విచారణలో కీలక దశ ముగిసింది. ఈ ఘటనలో నిందితుల పాత్ర నిజానిజాల నిర్ధారణ పరీక్షకు న్యాయస్థానం ఆదేశించింది. దీనిలోభాగంగా గుజరాత్‌లో వీరందరికి పోలిగ్రఫీ పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో తరలించారు. అక్కడ పరీక్షల ముగియడంతో భరతపూర్ ఠాణా ఇన్‌స్పెక్టరు ఇన్‌చార్జి దీన కృష్ణ మిశ్రాని నగరానికి సురక్షితంగా తరలించారు. అతనికి పోలిగ్రఫీ, నార్కో, బ్రెయిన్ మ్యాపింగ్ పరీక్షలు నిర్వహించినట్లు సమాచారం. ఇప్పటికీ ముగ్గురు నిందితులకు ఈ తరహా పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఒక సబ్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు సహాయ సబ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి



మహిళ మృతదేహం

జయపురం: సబ్ డివిజన్ బొరిగుమ్మ పోలీసుస్టేషన్ పరిధి ఝిలిమిలిగుడ గ్రామంలోని ఒక ఇంట్లో అనుమానాస్పదంగా మహిళ బుధవారం మృతి చెందింది. మరణించిన ఆ మహిళ రోజీ రవులో(42)గా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే బొరిగుమ్మ పోలీసు అధికారి జుగల్ కిశోర్ షా, ఏఎస్‌ఐ చందన ప్రసాద్ మఝిలు గ్రామానికి వెళ్లారు. అయితే ఇంటి లోపలి నుంచి తలుపులు వేసి, వెనుక వైపు నుంచి తాళాలు వేయడం గమనించి తాళాలు పగలుగొట్టి లోపలికి ప్రవేశించారు. రెండు రోజుల క్రితం ఆమె భర్త బలరాం రవులో ఆమెను ఇంటిలో పెట్టి బయట తాళాలు వేసి వెళ్లిపోయాడని గ్రామస్తులు పేర్కొన్నారు. అతను ప్రతిరోజూ వచ్చి ఆమెను కొట్టి హింసించేవాడని పోలీసులకు తెలిపారు. అయితే రోజీ ఎలా మరణించిందో తెలియడం లేదని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆమెది సాధారణ మరణమా లేక హత్యా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని బొరిగుమ్మ కమ్యూనిటీ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

మేఘమాల తోటలో..
ఆక్రమణల తొలగింపు

- అడ్డుకున్న నిరుపేదలు
- సర్ది చెప్పిన అధికారులు



బుల్‌డోజర్లతో ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది



తొలగింపును వ్యతిరేకించిన మహిళకు సర్దిచెబుతున్న అధికారి

జయపురం: జయపురంలో చారిత్రాత్మక మేఘమాలతోట ఆక్రమణలకు గురవుతోంది. ఈ విషయాన్ని గ్రహించిన జయపురం మున్సిపాలిటీ ఆక్రమణల తొలగింపునకు బుధవారం శ్రీకారం చుట్టింది. మున్సిపాలిటీ, రెవెన్యూ, పోలీసు అధికారుల సమక్షంలో ఆక్రమణలను తొలగిస్తున్నారు. ఆక్రమణ స్థలాల్లో ఉన్న భవనాలతోపాటు నిర్మాణంలో వాటిని బుల్‌డోజర్‌తో తొలగించారు. అయితే అధికారులు చేపట్టిన ఆక్రమణ తొలగింపును స్థానికులు వ్యతిరేకించారు. స్థలాలను ఆక్రమించి పెద్ద పెద్ద భవనాలు కట్టుకున్న వారిని వదిలేసిన అధికారులు తల దాచుకొనేందుకు కట్టుకున్న నిరుపేదల ఇళ్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. తొలగింపు సమయంలో కొంత ఉద్రిక్తత నెలకొనగా.. పోలీసులు జోక్యం చేసుకొని పరిస్థితిని అదుపు చేశారు. పట్టణంలో అక్రమ కట్టడాలను తొలగిస్తామని ఈ సందర్భంగా మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్ స్పష్టం చేశారు. మేఘమాలతోట ప్రాంతం అభివృద్ధి పరిచేందుకు ఆక్రమణలను తొలగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. తొలగింపు కార్యక్రమంలో అదనపు తహసీల్దార్ మనోరంజన్ సున, శానిటరీ ఇన్‌స్పెక్టర్ భబానీ హల్దు, పి.జగదీశ్వరరావు, రెవెన్యూ అధికారి దిలీప్‌కుమార్ ప్రధాన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ధిరెన్ చలాన్, పట్టణ పోలీసు ఏఎస్‌ఐ రమేష్ చంద్రమహాపాత్రో ఉన్నారు.

క్లుప్తంగా

యాక్సిడెంట్ కేసుల్లో సకాలంలో పరిహారం



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్ : రోడ్డు ప్రమాద కేసుల్లో బాధితులకు త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ స్కీమ్ కన్వీనర్, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో త్రైమాసిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసుల్లో త్వరితగతిన న్యాయం జరగాలన్నారు. సమావేశంలో డీఆర్వో ఎం.అప్పారావు, డీఎస్పీ బి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పలాస ఆర్డీఓకు గుండెపోటు



సుదర్శన దొరను తరలిస్తున్న సిబ్బంది

కాశీబుగ్గ: పలాస రెవెన్యూ డివిజన్ అధికారి సుదర్శన దొర బుధవారం గుండెపోటుకు గురై కార్యాలయంలోనే పడిపోయారు. ఇటీవలే విధుల్లో చేరిన ఈయన అనారోగ్యానికి గురికావడంతో వెంటనే సిబ్బంది కాశీబుగ్గలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యసేవలు నిమిత్తం కుటుంబ సభ్యులు విశాఖపట్నం తరలించి చికిత్స అందిస్తున్నారు.

పోక్సో కేసు నమోదు

సారవకోట: మండలంలోని చిన్నకిట్టాలపాడు పంచాయతీ కురడింగికి చెందిన బాలుడిపై మంగళవారం పోక్సో, అత్యాచారం, అట్రాసిటీ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.అనిల్‌కుమార్ తెలిపారు. గొర్రిబంద పంచాయతీకి చెందిన బాలిక 2021లో సారవకోట పాఠశాలలో పదో తరగతి చదువుతున్న రోజుల్లో ఒక వ్యక్తితో పరిచయం అయింది. అనంతరం సారవకోటలో ఇంటర్ చదవడానికి బస్సులో రాకపోకలు చేసే సమయంలో తరచూ కలవడం, ఫోన్లో మాట్లాడుతుండేవారు. ఈ క్రమంలో ఇటీవల మాయమాటలు చెప్పి బాలికను లోబరుచుకోవడంతో ఆ బాలిక గర్భం దాల్చింది. ఆరోగ్యం సరిగా లేకపోవడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించగా మూడు నెలల గర్భవతి అని వైద్యులు నిర్ధారించారు. ఆస్పత్రి వర్గాలు 1098కి, ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన సమాచారం మేరకు మైనర్‌పై పోక్సోతో పాటు ఇతర చట్టాల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కేసును డీపీటీసీ డీఎస్పీ దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

బెల్లం తయారీ పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న అటల్ భూజల్ బృందం

ఆమదాలవలస : మండలంలోని నిమ్మతొర్లువాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేస్తున్న చెరుకు పంటను ఉత్తరప్రదేశ్‌కు చెందిన అటల్ భూజల్ బృందం ప్రతినిధి అనిల్ భజయ్ పరిశీలించారు. బెల్లం తయారీ, సాగు పద్ధతులను ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర విభాగం ప్రతినిధి కృష్ణారావు, రీజనల్- కోఆర్డినేటర్ హేమసుందర్ వివరించారు. అనంతరం రైతులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎన్.ఎఫ్.ఎస్. శివ, శ్రీనివాస్, సూర్యనారాయణ, రమణ, పెంటయ్య, చిరంజీవి పాల్గొన్నారు.

20న జిల్లా జూనియర్స్ ఖోఖో జట్ల ఎంపికలు



ఖోఖో సాధనలో క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా జూనియర్స్ బాలబాలికల ఖోఖో జట్ల ఎంపికలు ఈ నెల 20న జరగనున్నాయని జిల్లా ఖోఖో అసోసియేషన్ శ్రీకాకుళం అధ్యక్ష కార్యదర్శులు చిట్టి నాగభూషణం, సీహెచ్ ఫల్గుణరావు బుధవారం తెలిపారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానం వేదికగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఎంపికలు మొదలవుతాయని చెప్పారు. 2006 నవంబర్ 21 తరువాత జన్మించిన వారు అర్హులని స్పష్టంచేశారు. క్రీడాకారుల ఇండెక్స్ వయస్సు, బరువు, ఎత్తు కలిపి మొత్తం 250 పాయింట్లుగా ఉండాలన్నారు. ఇక్కడ ఎంపికైన జిల్లా జట్లను అక్టోబర్ 25 నుంచి 27వ తేదీ వరకు చిత్తూరు జిల్లా కాణిపాకం వేదికగా జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ ఖోఖో చాంపియన్‌షిప్-2024 పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు పీడీ సాధు శ్రీనివాస్ (సెల్:9441914214)ను సంప్రదించాలన్నారు.

ఘనంగా నవీన్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మహిళా కార్యకర్తలు



రక్తదానం చేస్తున్న యువకులు



పర్లాకిమిడి: ఆర్.సీతాపురం అనాధాశ్రమంలో కేకును పంచిపెడుతున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

రాయగడ: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ 78వ జన్మదిన వేడుకలు బీజేడీ నాయకులు, కార్యకర్తలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఎన్‌బీఆర్ మైదానంలో ఉన్న ఆ పార్టీ కార్యాలయంలో వేడుకలను నిర్వహించారు. అనంతరం కార్యాలయం ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అంతకుముందు స్థానిక మజ్జిగౌరి దేవి మందిరం వద్ద మహిళా కార్యకర్తలు నవీన్ పట్నాయక్ బ్యానర్ పట్టుకుని అమ్మ ఆశీర్వాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు వినాయక్ కర్, రాయిసింగి బిడిక, సుజాత పాలో, సర్మిష్టా పాడి, బార్జి జగన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడిలో..

పర్లాకిమిడి: బీజేడీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం నవీన్ పట్నాయిక్ పుట్టిన రోజు వేడుకలను గుసాని సమితి ఆర్.సీతాపురం శ్రీజగన్నాథ నికేతన్ అనాధాశ్రమంలో ఎమ్మెల్యే రూపేష్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కేక్ కట్‌చేసి అనాథ బాలలకు పంచిపెట్టారు. పర్లాకిమిడి రామ్‌నగర్‌లోని టి.పి.హృద్రోగ స్పెషాలిటీ ఆస్పత్రిలో బీజేడీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ శిబిరంలో కాశీనగర్ సమితి చైర్‌పర్సన్ బల్ల శాయమ్మ, గుసాని సమితి చైర్మన్ ఎన్.వీర్రాజు, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, ఆర్.ఎం.సీ.ఎస్ అధ్యక్షుడు ఎస్.గజపతి రావు, బీజేడీ రాష్ట్ర సాధారణ కార్యదర్శి ప్రదీప్ నాయక్, బసంత్ దాస్, గుసాని జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.బాలరాజు, యువజన అధ్యక్షుడు శాసనం లింగరాజు, దిప్పు పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

కొరాపుట్‌లో..

కొరాపుట్: మాజీ సీఎం నవీన్ పట్నాయక్ జన్మదిన వేడుకలు బుధవారం కొరాపుట్ జిల్లా కేంద్రంలోని బీజేడీ కార్యాలయంలో పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జిన్ను హిక్క కేక్ కట్ చేసి మాజీ ఎమ్మెల్యే రఘురాం పాడాల్‌కి తినిపించారు. కార్యాలయం ముందు కార్యకర్తలు బాణ సంచా కాల్చారు. కొరాపుట్ మున్సిపల్ చైర్మన్ లలెటెందు రంజన్ శెఠి తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: రక్తదానం చేస్తున్న దృశ్యం



కొరాపుట్: కేక్ కట్ చేస్తున్న బీజేడీ నాయకులు

• గౌరీ పౌర్ణమి పూజలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

రాయగడ: స్థానిక జగన్నాథ మందిరం కూడలిలోని లక్ష్మీ గణపతి సన్నిధానంలో గౌరీ పౌర్ణమి పూజలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దీనిలో భాగంగా వేద పండితులు రేజేటి శ్రీరామ శర్మ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు జరిగాయి. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని పూజించారు. అదేవిధంగా గత నాలుగు రోజులుగా కంద్రవీధిలో నిర్వహిస్తున్న నందన్న పూజల్లో భాగంగా గౌరీ పౌర్ణమి ప్రత్యేక పూజలను చేపట్టారు.

నేటి నుంచి గజలక్ష్మీ పూజలు



పూజలకు సిద్ధమైన గజలక్ష్మీ అమ్మవారు

రాయగడ: నగరంలో గజలక్ష్మీ పూజలు గురువారం నుంచి ప్రారంభమవ్వనున్నాయి. స్థానిక న్యూకాలనీ, సబ్ కలెక్టర్ కార్యాలయం కూడలి, రామా టాకీస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఇప్పటికే పూజలకు సంబంధించి అన్ని పనులు పూర్తయ్యాయి. బుధవారం రాత్రి సమీపంలోని జంఝావతి నది నుంచి శుద్ధ జలాలను తీసుకొచ్చి అమ్మవారి సన్నిధిలో నిలపడంతో పూజలకు శ్రీకారం చుట్టారు. మొత్తం పదకొండు రోజుల పాటు పూజలు జరుగుతాయి.

శ్రీమందిరంలో ఓంఫెడ్ నెయ్యికే అనుమతి

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని దేవస్థానం శ్రీమందిరంలో కేవలం ఒడిశా రాష్ట్ర సహకార పాల ఉత్పాదకుల సమాఖ్య ఓంఫెడ్ నెయ్యిని మాత్రమే వినియోగించాలని పాలక మండలి తీర్మానించింది. ఈ మేరకు బుధవారం సేవాయత్‌లు ఇతర అనుబంధ వర్గాలతో నిర్వహించిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. నెయ్యి కల్తీ వంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఓంఫెడ్ హామీపూర్వకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. శ్రీ మందిరానికి నెయ్యి పూర్తి స్థాయిలో సరఫరా నిరంతరం సరఫరా చేసేందుకు వీలుగా శ్రీ మందిరం చేరువలో ప్రత్యేక డిపోని ఓంఫెడ్ నిర్మించాలని ప్రతిపాదించారు. నెయ్యిని తక్కువ ధరకు సరఫరా చేయాలని కోరారు. ఈ అభ్యర్థనల పట్ల ఓంఫెడ్ అంగీకారం తెలిపింది. కాగా,శ్రీ మందిరంలో మహా ప్రసాదం వంటకాలు, దైనందిన పూజలు, సేవాదులు, ఉత్సవాలు, భక్తులు వెలిగించే మట్టి ప్రమిద దీపాల్లో ఓంఫెడ్ నెయ్యి మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. ఇతర ఉత్పాదనల నెయ్యి వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవనిశ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి సీఏఓ డాక్టర్ అరవింద కుమార్ హెచ్చరించారు.

కన్న తండ్రే కాలయముడు



చిన్నారి మృతదేహంపై పడి రోదిస్తున్న కుటుంబసభ్యులు



మృతురాలు బ్లేశీ భోత్ర

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి దోరగుడ పంచాయతీ ఆర్ఎస్‌సీ-14 గ్రామంలో కుమార్తెను కన్న తండ్రి హత్య చేయడం కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. ఆర్ఎస్‌సీ 14 గ్రామానికి చెందిన సంజయ్ భోత్రకు బ్లేశీ రాణిభోత్ర అనే ఐదేళ్ల కుమార్తె ఉంది. బ్లేశీకి రెండేళ్ల వయసు ఉన్నప్పుడే తల్లి మృతిచెందింది. దాంతో అదే గ్రామానికి చెందిన సంగీతా పంగి అనే మహిళను రెండో పెళ్లి చేసుకున్నాడు. ఆమె మాటలు విని కుమార్తెను తండ్రి తరచూ కొట్టేవాడు. ఈ క్రమంలోనే బుధవారం ఉదయం కుమార్తెను కత్తితో పొడిచి పరారయ్యాడు. స్థానికులు స్పందించి చిన్నారిని చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయమై చిత్రకొండ పోలీసులు సమాచారం ఇవ్వగా ఐఐసీ ముకుందో మేల్క ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. నిందితుడు సంజయ్ కోసం గాలిస్తున్నారు.

స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలి



సమైక్య కార్యాచరణ కమిటీ సభ్యులు

జయపురం: జిల్లా స్థాయిలో స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలని పోరాటం సాగించేందుకు కొట్‌పాడ్‌లో అఖిల భారతీయ ఆదివాసీ భొత్ర బికాశ్ పరిషత్ కార్యాలయంలో బుధవారం సమైక్య కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేశారు. లక్ష్మణ పూజారి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జిల్లా స్థాయిలో ఉద్యోగాలు కల్పించక పోవటం వల్ల యువత ఇబ్బంది పడుతున్నారని, ఇతర జిల్లాల వారికే ఉద్యోగాలు లభిస్తున్నాయని వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితి మారాలంటే జిల్లా స్థాయిలోనే యువతకు ఉద్యోగాలు కావాలని, అందుకు సమైక్య పోరాటం అవసరమన్నారు. కమిటీ అధ్యక్షుడిగా సుధీర్ చంద్ర మహంతి, ఉపాధ్యక్షుడిగా పరశురాం మఝి, కార్యదర్శిగా చందన బాగ్, సలహాదారునిగా బాపూన్ త్రిపాఠీ, నీలకంఠ పూజారి, కార్యవర్గ సభ్యులుగా కె.రాజశేఖరరావు, జయంత పట్నాయిక్, బాలకృష్ణ మఝి, గురునాథ్ హరిజన్, 17 మంది సర్పంచ్‌లు, పట్టణంలోని 13 వార్డుల కౌన్సిలర్లను కమిటీలో సభ్యులుగా చేర్చారు. అనంతరం కొట్‌పాడ్ ప్రజల సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సభ్యులు త్రిపతి చలాన్, సర్పంచ్ త్రినాథ్ మఝి, బలదేవ్ సమరత్, మాజీ సర్పంచ్ ప్రపుల్ల దురువ, సరేంద్ర మఝి, అర్జున భొత్ర, రంజీన్ మహురియ, బి.సాంబమూర్తి ఆచారి, గంగాధర భొత్ర, సురేంద్ర గదబ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కెరామటి పంచాయతీ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే భొత్ర

• కొటపాడ్ ఎమ్మెల్యే రూపు భొత్ర

జయపురం: కెరామటి గ్రామ పంచాయతీ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని కొట్‌పాడ్ ఎమ్మెల్యే రూపు భొత్ర ప్రజలకు హామీ ఇచ్చారు. కుంద్ర సమితిలో ఆయన బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కెరామటిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కెరామటిలో పంచాయతీ కార్యాలయం నిర్మించాలని స్థానికులు ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నా గత పాలకులు నేరవేర్చలేదని ఆరోపించారు. ప్రజల కోరికను తాను త్వరలోనే నెరవేరుస్తానని స్పష్టం చేశారు. పంచాయతీ ప్రజలు సమితి కార్యాలయానికి పనుల కోసం 20 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుందన్నారు. ప్రజలు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర సరిహద్దున నివాసం ఉండటం వలన రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు దూరమౌతున్నారని అన్నారు. గ్రామ సమీపంలో కొలాబ్ నది ఉండడంతో రేషన్ సరుకులు కెరామటి ప్రజలకు చేరడం లేదని చెప్పారు. పంచాయతీ ప్రజలకు నిత్యావసర వస్తువులు జబాపదర్‌లో సరఫరా చేయాలని గతంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని.. ఆయన బీడీవోకు ఆదేశించినా పట్టించుకోవటం లేదని ప్రజలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన వెంటనే జబాపదర్‌లో నిత్యావసర వస్తువులు అందజేయాలని బీడీవోను ఆదేశించారు. సమావేశంలో స్థానిక పెద్దలు బద్రి నారాయణ ఆచార్య, భగవాన్ పండ, అభిలేష్ బెహర, ప్రకాశ్ పట్నాయక్, తుషార్ భట్, లక్ష్మణ భొత్రా, జయసింగ్ శాంత పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



మహిళా సంఘాలకు రుణ మంజూరు పత్రాలను అందజేస్తున్న జీఎం కౌశల కిశోర్ సింగ్

జయపురం. తమ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎస్‌బీఐ ప్రాంతీయ జనరల్ మేనేజర్ కౌశల కిశోర్ సింగ్ అన్నారు. బొరిగుమ్మలో కొత్తగా నిర్మించిన ఎస్‌బీఐ కార్యాలయ భవనాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ఖాతాదారులకు ఉత్తమ సేవలు అందిస్తున్నామన్నారు. ముఖ్యంగా మహిళా సాధికారతకు, రైతులు, చిరు వ్యాపారులకు రుణాలు అందించాలని బ్యాంక్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఐదు స్వయం సహాయక గ్రూపు మహిళలకు రూ. ఐదు లక్షల రుణ సహాయం, ఒకరికి గృహ నిర్మాణానికి రుణం మంజూరు పత్రాన్ని అందజేశారు.

కార్యక్రమంలో కొరాపుట్ రీజనల్ మేనేజర్ సుభాష్ చంద్ర బెహర, బొరిగుమ్మ బ్రాంచ్ మేనేజర్ నిరోజ్ కుమార్ షాహా, బ్యాంక్ సిబ్బంది డి.కల్పన, పద్మనాభ నాయిక్, బాసుదేవ్ సాహు, సౌరబ కుమార్ పండ, బిశ్వజిత్ మహంతి, సుమంత కుమార్ నాయిక్ పాల్గొన్నారు.

కారు దగ్ధం



మంటల్లో కారు



మంటలను అదుపులోకి తెస్తూ..

భువనేశ్వర్: కదులుతున్న కారులో అకస్మాతుగా మంటలు చెలరేగాయి. అదృష్టవశాతు కారు నష్టం మినహా ఇతర హాని సంభవించ లేదు. ఈ సంఘటన స్థానిక 16వ నంబర్ జాతీయ రహదారి నయాపల్లి దుర్గా మండపం పరిసరాల్లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. అగ్నిమాపక దళం మంటలను నివారించింది.

పాముకాటుతో బాలిక మృతి



బాలిక మృతదేహం

మల్కన్‌గిరి: కలిమెల సమితి పేరుబే గ్రామంలో 12 ఏళ్ల బాలిక పాముకాటుతో మృతి చెందింది. మంగళవారం రాత్రి ఇంటిలో భోజనం చేసి నిద్రపోతున్న ఉంగిమాడీ (12) అనే బాలిక చెవిపై విషసర్పం కాటు వేసింది. వెంటనే బాలిక కేకలు వేయగా తల్లి లేచి పామును చంపేసింది. అనంతరం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం బాలిక మృతి చెందింది. కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

1123 కేజీల గంజాయి పట్టివేత



జయపురం: పట్టుబడిన గంజాయి బస్తాలు



రాయగడ: గంజాయితో పట్టుబడిన నిందితులు



రాయగడ: పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, మొబైల్ ఫోన్లు

జయపురం: విజయవాడ-రాంచీ జాతీయ రహదారిలో బొయిపరిగుడ నుంచి జయపురం వస్తున్న లగేజీ రవాణా వాహనంలో 1123 కేజీల 660 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి బుధవారం తెలిపారు. మంగళవారం రాత్రి 8.30 గంటల సమయంలో పాత్రోపుట్ ప్రాంతంలో సబ్ ఇన్‌స్పెక్టర్ శిరిష్ మహాపాత్రో నేతృత్వంలో పోలీసు సిబ్బంది పెట్రోలింగ్ జరుపుతుండగా పోలీసులను చూసిన ఓ వాహనం డ్రైవర్ దూరంగా ఆపేసి అటవీ ప్రాంతంలోకి పరారయ్యాడు. వెంటనే వెళ్లి తనిఖీ చేయగా వాహనంలో గంజాయి బస్తాలు కనిపించాయి. వాటి బరువు 1123 కేజీల 660 గ్రాములు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

191 కిలోల గంజాయి స్వాధీనం : ముగ్గురి అరెస్టు

రాయగడ: వాహనాల తనిఖీ చేసిన పోలీసులకు భారీగా గంజాయి పట్టుబడింది. జిల్లాలోని పద్మపూర్ పోలీసులు బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా లారీ, పికప్ వ్యాన్లలో అక్రమంగా తరలిస్తున్న 191 కిలోల 900 గ్రాముల గంజాయి పట్టుబడింది. ఈఘటనలో మధ్యప్రదేశ్‌కు చెందిన అజిమిర్ సింగ్, మిలన్ శర్మ, సంజీవ్ కుమార్‌లను అరెస్టు చేసిన పోలీసులు వారిని కోర్టుకు తరలించారు. నిందితుల నుంచి నాలుగు మొబైల్ ఫోన్లు, 2,170 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. పద్మపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబాకొల్ల రొడ్డు కూడలిలో వాహన తనిఖీలను చేపట్టే క్రమంలో ఆర్.ఉదయగిరి నుంచి పద్మపూర్ వైపు వస్తున్న లారీ, మరో బొలేరో పికప్ వ్యాన్‌లో గంజాయి పట్టుబడిందని పోలీసు అధికారులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

క్లుప్తంగా

నడిపించు నా నావ..!

- వంశధార నదిపై ఆకట్టుకుంటున్న పడవ ప్రయాణం



వంశధార నదిపై నాటు పడవ ప్రయాణం

భామిని: మండలంలో నది ఆవల గల ఒడిశాలోని గజపతి జిల్లా గ్రామాలకు పడవ ప్రయాణమే ఆధారం. తెలుగు-ఒడియా ప్రజల మధ్య అనుసంధాన కర్తగా నాటు పడవ ప్రజలను కలుపుతోంది. ఆంధ్రా-ఒడిశాల మధ్య వంశధార నదిపై నాటు పడవపై ప్రయాణం అలరిస్తోంది. నదిలో నామమాత్రపు నీటిలో సంధ్యవేళ, ఉదయం పూట నాటు పడవ ప్రయాణం ఉల్లాసంగా సాగుతోంది. నాటు పడవకు ఇంజిన్లు పెట్టి ప్రయాణికులకు ఎండ తగలకుండా డేరాలు కట్టి నదిపై ప్రయాణికులను పడవ తీసుకువెళ్తున్న దృశ్యం చూపరులను కట్టిపడేస్తోంది.

ప్రత్యేక డయేరియా వార్డు సిద్ధం చేయండి

- డీసీహెచ్ఎస్ రాజ్యలక్ష్మి



వైద్యులతో సమావేశం నిర్వహిస్తున్న డీసీహెచ్ఎస్ రాజ్యలక్ష్మి

చీపురుపల్లి: ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో 20 పడకలతో ప్రత్యేక డయేరియా వార్డు సిద్ధం చేయాలని జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయాధికారి రాజ్యలక్ష్మి చెప్పారు. ఈ మేరకు బుధవారం ఆమె చీపురుపల్లి సీహెచ్‌సీని సందర్శించి అక్కడి వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీహెచ్‌సీలో ప్రస్తుతం ఉన్న వార్డులకు అదనంగా 20 పడకల సామర్థ్యంతో ప్రత్యేక డయేరియా వార్డు ఏర్పాటు చేయాలని సూచించారు. గుర్ల మండలంలో డయేరియా వ్యాధి లక్షణాలతో అధిక సంఖ్యలో కేసులు నమోదవుతున్న తరుణంలో అక్కడి నుంచి వచ్చే రోగులకు చీపురుపల్లి సీహెచ్‌సీలో మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఇప్పటికే గుర్ల మండలంలో ఉన్న పీహెచ్‌సీలో రోగులు ఎక్కువవడంతో అక్కడి నుంచి డయేరియా రోగులను చీపురుపల్లి సీహెచ్‌సీకి పంపిస్తున్నట్లు చెప్పారు. గుర్ల మండలం మాత్రమే కాకుండా నియోజక వర్గంలో ఎక్కడి నుంచి డయేరియా కేసులు వచ్చినా అడ్మిట్ చేసుకుని తక్షణ వైద్య సహాయం అందించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డా.సుధీర్, వైద్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 14 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో సిబ్బంది

పార్వతీపురంటౌన్: రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలకు 14 మంది విద్యార్థులు ఎంపికైనట్లు డీఈఓ జి.పగడాలమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ స్కూల్‌గేమ్స్‌లో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో స్కూల్ గేమ్స్ అండర్-14, అండర్-17 కేటగిరీల్లో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు బాల బాలికలకు నిర్వహించగా ఎంపిక పోటీల్లో అండర్ -14విభాగంలో 7గురు, అండర్-17విభాగంలో7 గురు చొప్పున బాలికలు, బాలురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. నెల్లూరులో జరిగే పోటీల్లో వారంతా పాల్గొంటారన్నారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు, స్కూల్‌గేమ్స్ సెక్రటరీ ఎం.మురళీ కృష్ణ ఈ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 150 మంది విద్యార్థులు హాజరు కాగా 50 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి తీవ్ర గాయాలు



పాలకొండ రూరల్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఓ ఉపాధ్యాయు డు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. మండంలోని ఎం.సింగుపురం ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న టీఎస్.శివాజీ తన కుమార్తెను విజయవా డ బస్సు ఎక్కించేందుకు కాంప్లెక్స్‌కు చేరుకున్నారు. ఆమెను బస్సు ఎక్కించిన మాస్టారు ఓ బ్యాగ్ బస్సులోకి ఇచ్చి రెండవ బ్యాగ్‌ను అందించేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో అవుట్ గేట్ నుంచి బస్సు బయటకు కదలడంతో మాస్టారు కుడికాలిపైకి బస్సు టైరు ఎక్కడంతో పాదం పూర్తిగా నుజ్జయింది. దీంతో వెంటనే ఆయనను 108 వాహనంలో తొలుత స్థానిక ఏరియా ఆస్పత్రికి అక్కడి నుంచి విశాఖ రిఫర్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కళ్ల ముందే తండ్రి ప్రమాదం బారిన పడడంతో కుమార్తె కన్నీటి పర్యంతమైంది.

డయేరియాతో మరణాలు ప్రభుత్వ హత్యలే!

- గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం, ప్రాథమిక వైద్యం
- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గుర్లలో నలుగురు మృతి
- మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- విజయనగరం జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు డిమాండ్



విజయనగరం సర్వజన ఆస్పత్రిలో డయేరియా బాధితులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లో పారిశుద్ధ్యం, ప్రాథమిక వైద్యం పడకేశాయని, ఫలితంగా విజయనగరం జిల్లాలో అనేక గ్రామాల్లో డయేరియా విజృంభిస్తోందని విజయనగరం జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క గుర్ల మండల కేంద్రం లోనే డయేరియా బారిన పడి నలుగురు మృతి చెందారని, విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. మృతుల కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని అభయమిచ్చారు. ప్రభుత్వ నిర్లక్ష్య పాలన వల్లే నలుగురు మృత్యువాత పడ్డారని, ఇవి ప్రభుత్వ హత్యలేనని విమర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండు చేశారు. విజయనగరం జిల్లా సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 22 మంది డయేరియా రోగులను బుధవారం ఆయన పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంబంగి అప్పలనాయుడు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పీఏ రమణి, జనరల్ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బోళం పద్మావతిలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పేద ప్రజల ప్రాణాలను టీడీపీ కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ స్థాయిలో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు, సచివాలయంలో ఏఎన్‌ఎంల నియామకంతో ప్రాథమిక వైద్యం అందుబాటులోకి తెచ్చిందని గుర్తు చేశారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ఇంటింటికీ వైద్యులను, వైద్య సిబ్బందిని పంపించి ఎప్పటికప్పుడు ప్రజల ఆరోగ్య పరిస్థితిని కనిపెట్టుకొని ఉండేవారని చెప్పారు. ఏ ఒక్కరిలో రోగ లక్షణాలు కనిపించినా తక్షణమే చికిత్స అందించేవారని, తద్వారా రోగాలకు అడ్డుకట్ట వేయగలిగారని వివరించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని పూర్తిగా గాలికి వదిలేసిందనడానికి గుర్ల మండలంలో డయేరియా విజృంభణే నిదర్శనమన్నారు. జిల్లా కేంద్రానికి కేవలం పదీ పన్నెండు కిలోమీటర్ల దూరమే ఉన్నా నలుగురి ప్రాణాలు పోవడం, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా మారడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల పరిస్థితి దయనీయంగా మారిందని, తగిన నిధుల్లేవని వైద్యులే చెబుతున్నారని అన్నారు. రోగాల బారిన పడిన వారిని ఎవ్వరూ పట్టించుకోవట్లేదని, ఏదో చుట్టంలా చూసి పోతున్నారని విమర్శించారు. గత నెల రోజులుగా పలు గ్రామాల్లో డయేరియా బయటపడుతున్నా కనీసం వైద్య శిబిరాలు పెట్టిన దాఖలాల్లేవన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ లేదని, పరిశుభ్రత లోపించిందని చెప్పారు.

పల్లెల్లో పండగ ఎక్కడా?

పల్లెల్లో పండగ అని చెబుతున్న రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఒకసారి విజయనగరం జిల్లా వచ్చి చూడాలని చిన్నశ్రీను కోరారు. గ్రామాల్లో పండగ వాతావరణం ఉందో, భయానక పరిస్థితులున్నాయో వస్తే తెలుస్తుందన్నారు. గత రెండు నెలలుగా వ్యవస్థలేవీ పని చేయలేదని, బదిలీల పేరుతో అధికారులను, ఉద్యోగులను టీడీపీ నాయకులు తమ ఇళ్లు, క్యాంప్ కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడానికే సరిపోయిందని విమర్శించారు.

ఇతర అనారోగ్య కారణాల వల్లే..

గత పదిహేను రోజుల కాలంలో మండల కేంద్రమైన గుర్లతో పాటు పెనుబర్తి, కోటగండ్రేడు, గోషాడ గ్రామాల్లో పలువురు డయేరియా బారిన పడ్డారు. వారిలో గుర్లకు చెందిన చింతపల్లి అప్పారావు, కలిశెట్టి సీతమ్మ, సారికి పెంటయ్య, గుమ్మిడి పైడమ్మ, పాండ్రంగి రాము వారం రోజుల వ్యవధిలోనే మృతి చెందారు. అయితే వారి మృతికి డయేరియా కారణం కాదని, ఇతర అనారోగ్య కారణాలని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కరరావు చెబుతున్నారు. వరదకు కొట్టుకొచ్చిన జంతు కళేబరాల వల్లే చంపావతి నది జలాలు కలుషితమయ్యాయని, అక్కడి తాగునీరు సరఫరా అవుతున్న గ్రామాల్లో డయేరియా ప్రబలిందనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే అవన్నీ అపోహేనని, నీటి పరీక్షల్లో నెగెటివ్ వచ్చిందని, నీరు కలుషితమవ్వలేదని జిల్లా కలెక్టరు బీఆర్ అంబేడ్కర్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

డయేరియా బాధితులకు పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకర రావు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్ల గ్రామానికి చెందిన డయేరియా బాధితులను రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకర రావు బుధవారం పరామర్శించారు. డయేరియాతో ఉత్పన్నమైన పరిస్థితులు, ప్రస్తుతం వారి ఆరోగ్య స్థితిపై వాకబు చేశారు. రోగులకు అదుతున్న చికిత్స వివరాలపై వైద్యులు, ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ఆరా తీశారు. మెరుగైన వైద్యసేవలు బాధితులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అప్పలనాయుడు, డాక్టర్ బోళం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

విజయనగరం అర్బన్: రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10.30 గంటలకు బొండపల్లి మండలం గొల్లుపాలెంలో.. 11.30 గంటలకు మరువాడ గ్రామాల్లో జరగనున్న పల్లెపండుగ కార్యక్రమాల్లో పాల్గొంటారని మంత్రి కార్యాలయ సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మధ్యాహ్నం 3 గంటలకు గజపతినగరం మండలం పురిటిపెంట, 3.45 గంటలకు మల్లునాయుడుపేట, 4.30 గంటలకు మరుపల్లిలో నిర్వహించే పల్లె పండుగ కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు.

దళితుల భూమి ఆక్రమణకు ఎమ్మెల్యే యత్నం



అడ్డగించిన పనుల ప్రదేశం వద్ద నిరసన తెలియజేస్తున్న దనాలపేట గ్రామానికి చెందిన బాధితులు

భోగాపురం: అభాగ్యులు, అనామకులు, నియోజక వర్గ ప్రజలకు సమస్యలు వస్తే అండగా ఉండాల్సిన ఎమ్మెల్యే..ఆ అభాగ్యులకే సమస్యలు తెచ్చిపెడుతుంటే ఇంక వారికి మొర పెట్టుకునే దిక్కెవరు? కంచే చేను మేస్తున్న చందాన నెల్లిమర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే లోకం నాగమాధవి తీరు ఉన్నట్లు పలువురు బాధితులు వాపోతున్నారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. భోగాపురం మండలంలోని ముంజేరు పంచాయతీ ధనాలపేట గ్రామానికి చెందిన కొందరు దళితుల భూముల్ని తమ పేరుపై మార్చుకునేందుకు నెల్లిమర్ల ఎమ్మెల్యే నాగమాధవి వేసిన ఎత్తుగడ శనివారం బట్టబయలైంది. ధనాలపేట గ్రామానికి చెందిన ధనాల శ్రీనివాసరావుకు సర్వే నంబర్ 338-4లో 56 సెంట్ల భూమి ఉంది. ఇది ఆయన తండ్రి ధనాల రాముడు నుంచి వారసత్వంగా వచ్చింది. అయితే మూడేళ్ల క్రితం తండ్రి ధనాల రాముడు చనిపోయినప్పటికీ ఆరునెలల క్రితమే ఫోర్జరీ సంతకంతో ఆ భూమిని స్థానిక ఎమ్మెల్యే తన పేరున సవరణ చేయించుకున్నారని బాధితుల వాదన. స్థానిక ఎమ్మెల్యేకు రెవెన్యూ అధికారులు అండగా ఉండడంతో ఈ పని సజావుగా కానిచ్చేశారని ఆరోపిస్తున్నారు. అదే భూమిలో గోడ కట్టేందుకు స్థానిక ఎమ్మెల్యే మనుషులు బుధవారం రంగం సిద్ధం చేయగా విషయం తెలుసుకున్న భూమి యాజమాని, గ్రామస్తులు వెళ్లి పనులను అడ్డగించారు. ఈ విషయం ముందే తెలుసుకున్న ఎమ్మెల్యే నాగమాధవి పోలీసులను సంఘటన స్థలానికి రప్పించి పనులను ప్రారంభించారు. అయితే గ్రామస్తులు మూకుమ్మడిగా అడ్డం తిరగడంతో ఎమ్మెల్యే మనుషులు వెనక్కి తగ్గి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇది తమ భూమేనని కావాలనే పనులను గ్రామస్తులు అడ్డగిస్తున్నారని మిరాకిల్ సంస్థ ఎస్టేట్ మేనేజర్ వెంకట్ అన్నారు.

వైద్య విద్యార్థులకు రవాణా కష్టాలు..!

- బస్సు సౌకర్యం లేక అవస్థలు
- సొంత ఖర్చులతో సర్వజన ఆస్పత్రికి వస్తున్న విద్యార్థులు



ఆటో కోసం నడిచి వెళ్తున్న వైద్య విద్యార్థులు



విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాలలో చదువుతున్న వైద్య విద్యార్థులు రవాణా సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. అరకిలోమీటరు కాలినడకన వచ్చి తర్వాత ఆటోలో సర్వజన ఆస్పత్రికి వస్తున్నారు. ఇది ఏదో ఒక రోజు కాదు నిత్యం వారు ఎదుర్కొంటున్న సమస్య. ముఖ్యంగా వైద్య విద్యార్థినులు రావడానికి ఇబ్బంది పడుతున్నారు. ఆటోలు సకాలంలో రాక పోవడం వల్ల సమయానికి సర్వజన ఆస్పత్రికి చేరుకోలేకపోతున్నారు. ఉదయం ఆస్పత్రికి రావడం తిరిగి హాస్టల్‌కు చేరుకోవడానికి అవస్థలు తప్పడం లేదు. గాజులరేగ వద్ద ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలలో 150 మంది వైద్య విద్యార్థులు ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. సెకెండ్ ఇయర్‌లో వారికి ప్రతి రోజు క్లినికల్ పోస్టింగ్స్ ఉంటాయి. వాటికి వైద్య వారంతా హాజరు కావాల్సి ఉంటుంది. వారికి ఆస్పత్రిలోని వివిధ వైద్య విభాగాల గురించి ప్రొఫెసర్లు వివరిస్తారు.

వైద్య కళాశాల క్యాంపులకే బస్సు

వైద్య కళాశాల ద్వారా నిర్వహించే క్యాంపులకు మాత్రమే బస్సు సౌకర్యం కల్పిస్తాం. సెకెండ్ ఇయర్ చదివే విద్యార్థులకు ప్రస్తుతం క్లినికల్ పోస్టింగ్ అవుతున్నాయి. వాటికి వారి సొంత ఖర్చులతో అటెండ్ అవాలి.
డాక్టర్ పద్మలీల,
ప్రిన్సిపాల్, ప్రభుత్వ వైద్య కళాశాల

ఆటోలో ప్రతిరోజూ వస్తున్న వైద్య విద్యార్థులు

ప్రతిరోజూ వైద్య విద్యార్థులు క్లినికల్ పోస్టింగ్స్ కోసం వైద్య కళాశాల నుంచి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి ఆటోలో వస్తున్నారు. వైద్య కళాశాలలోని హాస్టల్ భవనం నుంచి జేఎన్‌టీయూ జంక్షన్ వరకు కాలినడకన వచ్చి అక్కడి నుంచి ఆటోలో సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి రావాల్సి వస్తోంది. ఆటో దొరికితే సమయానికి చేరుకుంటున్నారు. లేదంటే ఆలస్యం జరుగుతోంది. ఆటోలకు సొంత ఖర్చులతో వైద్య విద్యార్థులు ఆస్పత్రికి వస్తున్నారు. అదే బస్సు అయితే అందరూ ఒకేసారి ఆస్పత్రికి చేరుకోవడానికి అవకాశం ఉంటుంది.

వైద్య కళాశాలకు రెండు బస్సులు ఉన్నప్పటికీ..

ప్రభుత్వ వైద్య కళాశాలకు రెండు బస్సులు ఉన్నప్పటికీ వాటిని విద్యార్థులను ఆస్పత్రికి తీసుకుని వెళ్లడానికి కేటాయించడం లేదు. దీంతో వారికి ఆటోల్లో ఆస్పత్రికి రాక తప్పని పరిస్థితి.

బస్సును ఢీకొన్న ఆటో : మహిళ మృతి

- మరో ఇద్దరికి గాయాలు



బోల్తా పడిన ఆటో

గరుగుబిల్లి: పార్వతీపురం నుంచి వీరఘట్టం వెళ్తున్న ఆర్టీసీ బస్సును, వీరఘట్టం నుంచి పార్వతీపురం వస్తున్న ఆటో ఆ రహదారి పరిధిలోని పిట్టల మెట్ట జంక్షన్ వద్ద బుధవారం మధ్యాహ్నం బలంగా ఢీకొట్టడంతో ఆటోలో ఉన్న ఒక మహిళ మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రంగా గాయాలయ్యాయి. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రధాన రహదారి పరిధిలో మధ్యాహ్నం 12 గంటల సమ యంలో పార్వతీపురం నుంచి వస్తున్న బస్సును ఎదురుగా అజాగ్రత్తగా..నిర్లక్ష్యంగా ప్రయాణికులతో వస్తున్న ఆటో ఢీకొట్టడం వల్ల ఆటోలో ఉన్న వీరఘట్టం గ్రామానికి చెందిన యండవ యశోదమ్మ(47) అక్కడికక్కడే మృతి చెందింది. అదే ఆటోలో ఉన్న మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటనలో ఆటో బోల్తాపడడంతో పాటు నుజ్జునుజ్జయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం, క్షతగాత్రులను వైద్య నిమిత్తం పార్వ తీపురం జిల్లా హాస్పిటల్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


క్వారీ గోతిలో పడి వ్యక్తి..



తుప్పల్లో పడిపోయి మృతి చెందిన యశోదమ్మ

శృంగవరపుకోట: పట్టణం శివారులో ఉన్న క్వారీ గోతిలో పడి ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయినట్లు సీఐ వి.నారాయణమూర్తి చెప్పారు. బర్మాకాలనీకి చెందిన కర్రి స్వామిరాజు బుధవారం ఉదయం 8గంటల సమయంలో బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి సాయంత్రం వరకూ ఇంటికి వెళ్లక పోవడంతో స్వామిరాజు భార్య జోగీశ్వరి, బంధువులు కాలనీ పరిసరాల్లో వెదికారు. ఈ క్రమంలో వారికి క్వారీ వద్ద ఉన్న నీటి గోతిలో స్వామిరాజు మృతదేహం కనిపించింది. దీంతో ప్రమాదవశాత్తు గోతిలో పడి చనిపోయినట్లు మృతుడి భార్య జోగీశ్వరి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా హెచ్‌సీ ఆనందరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వి.నారాయణమూర్తి చెప్పారు.

కోనేటిలో మునిగిపోయి వ్యాపారి..



రమేష్ మృతదేహం

బాడంగి: మండలకేంద్రం బాడంగిలోని ఎస్సీ కాలనీకి చెందిన పండ్ల వ్యాపారి కండిరమేష్ (52) ప్రమాదవశాత్తు కోనేటిలో మునిగిపోయి బుధవారం మృతిచెందాడు. ఇందుకు సంబంధించి స్థానిక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రమేష్ కాలకృత్యాలకోసం స్నానానికని కోనేటికి వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. దీంతో నీటిలో మునిగిపోయి ఊపిరాడక మృత్యువాతపడ్డాడు. భార్య లక్ష్మి, బంధువులు వెతుకుతున్న క్రమంలో కోనేటిలో శవమై తేలడాన్ని అటువైపుగా వెళ్లినవారు చూసి చెప్పగా కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై తారక రామారావు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరారైన యువకుడి ఆత్మహత్య



రాకేష్ మృతదేహం

పార్వతీపురం టౌన్: లైంగికదాడి కేసులో నిందితుడిగా నమోదైన యువకుడు పోలీసుల కళ్లుగప్పి పరారై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పార్వతీపురం పట్టణంలోని బెలగాం రైల్వేస్టేషన్ సమీపంలో సంభవించిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక జిల్లాకేంద్రంలో చదువుతుంది. ఆ విద్యార్థినికి మాయమాటలు చెప్పి అదే గ్రామానికి చెందిన యువకుడు లైంగికదాడికి పాల్పడినట్లు పార్వతీపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా బాధిత బాలికకు జిల్లా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి విచారణకు పోలీస్‌స్టేషన్‌కు తీసుకురాగా అక్కడి నుంచి పరారైన నిందిత యువకుడు బుధవారం బెలగాం రైల్వేస్టేషన్‌లో మృతదేహమై కనిపించాడు. ఈ ఘటనపై జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ రత్నాకర్ మాట్లాడుతూ పార్వతీపురం మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన రాకేష్ (18) భయంతో రైల్వే ట్రాక్‌పై పడి ఆత్మహత్య చేసుకున్నాడని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించామన్నారు. ఈ ఘటనపై మృతుని తల్లిదండ్రులు స్పందిస్తూ పోలీసుల బెదిరింపు కారణంగా భయపడి తమ కుమారుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు చెప్పారు.

వైద్యశిబిరం సందర్శన

- గుర్లలో పర్యటించిన కలెక్టర్ అంబేడ్కర్



డయేరియా రోగుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ అంబేడ్కర్

గుర్ల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ బుధవారం సందర్శించారు. డయేరియాతో బాధపడుతున్న రోగులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్యం అందుతున్న వారు ఆందోళన చెందవద్దని సూచించారు. డయేరియాతో బాధపడుతున్న వారికి పూర్తిగా నయం అయ్యే వరకు వైద్యం అందించాలని వైద్యాధికారి చెన్నయ్యను ఆదేశించారు. తాగునీరు కలుషితం అవడంతో డయేరియా ప్రబలిందని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమాశంకర్ వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో భూగర్భ జలాలు కలుషితం కావడంతో ఆప్రదేశాన్ని గుర్తించే పనిలో ఉండి, గ్రామంలోని ఐదు కుటుంబాల వారి ఇళ్లలో ఉన్న బోర్లలో నీరు పూర్తిగా కలుషితమైందని వాటిని పూర్తిగా తొలగించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. రోడ్డు పక్కల చెత్తాచెదారాలు ఉండడంతో సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాధారణ పరిస్థితులు వచ్చే వరకు అధికారులకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డయేరియా వల్ల ఎక్కువగా మృతి చెందినట్లు పుకార్లు పుట్టించిన వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. డీఎంహెచ్ఓ భాస్కరరావు వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్నారు. గ్రామంలో డీపీఓ వెంకటేశ్వరరావు, ఆర్‌డీఓ సత్యవాణి పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు.

ఆన్‌లైన్ జాబ్ పేరిట కాల్స్‌తో అప్రమత్తం

- ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్:ఆన్‌లైన్ మోసాలతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. రోజురోజుకూ ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్నాయని, సైబర్ మోసగాళ్ల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, లేకుంటే సైబర్ మోసానికి గురై, భారీ మూల్యం చెల్లించుకోక తప్పద ని హెచ్చరించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే 1930కి ఫిర్యాదు చేయాలని, నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో పిర్యాదు వివరాలను సైబర్ క్రైమ్.జీఓవీ.ఇన్‌లో నమోదుచేయాలని ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

బరితెగించిన బియ్యం మాఫియా

- టన్నుల కొద్దీ నిల్వలు
- అక్రమ మార్గంలో పీడీఎస్ బియ్యం కొనుగోలు
- అధికారుల దాడుల్లో పట్టుబడుతున్న బియ్యం



సివిల్ సప్లయిస్ అధికారులు, పోలీసులు ఇటీవల నెలివాడ వద్ద పట్టుకున్న పీడీఎస్ బియ్యం

బొండపల్లి: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు సరఫరా చేస్తున్న బియ్యాన్ని మాఫియాగా తయారైన వ్యాపారుల ముఠా పక్కదారి పట్టిస్తోంది. మొన్న గజపతినగరం, నిన్న బొండపల్లిలో పట్టుబడిన టన్నుల కొద్దీ బియ్యం ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. గ్రామాల్లో టన్నుల కొద్దీ పీడీఎస్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి తిరిగి వాటిని మిల్లర్లకే విక్రయిస్తూ లక్షలాది రుపాయలను కొంతమంది సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా గజపతినగరం నియోజకవర్గం పరిధిలో పెద్దఎత్తున పీడీఎస్ బియ్యం రెండు నెలల వ్యవధిలో టన్నుల కొద్దీ అధికారుల దాడుల్లో పట్టుబడడంతో ఈ మాఫియా ఎంతలా అక్రమ వ్యాపారం చేస్తోందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.


పట్టుబడిన టన్నుల కొద్దీ బియ్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పీడీఎస్ బియ్యం అక్రమ కొనుగోలు, నిల్వలు చేయడం వంటి కార్యక్రమాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పట్టుబడిన వారిపైన కూడా నామమాత్రం కేసులు (6ఎ) నమోదు చేసి పట్టుకున్న బియ్యాన్ని సీజ్ చేసి వేలం వేయడంతోనే అధికారులు సరిపెడుతుండడంతో మాఫియా ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల కాలంలోనే నియోజకవర్గంలో ఎక్కడా లేని విధంగా బియ్యం నిల్వలు పట్టుబడ్డాయి. ఒక చోట రైస్ మిల్లులో పట్టుబడగా, ఇంకో చోట ఏకంగా నిల్వ చేయడానికి ఇల్లు అద్దెకు తీసుకున్న సంఘటనలు దర్శనమిచ్చాయి. పేదల ఆరోగ్యం కోసం గత ప్రభుత్వం ఉచితంగా ఫోర్టిఫైడ్ బియ్యం అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా అది ఇప్పుడు బియ్యం మాఫియాకు వరంగా మారింది.గత నెలలో గజపతినగరంలోని వాసవి ట్రేడర్స్ మిల్లులో (నాని,గణేష్)లు నిల్వ చేసిన 300 వరకు బస్తాల పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లయిస్ అధికారులు దాడి చేసి సీజ్ చేశారు. అక్టోబరులో గరుడుబిల్లి జంక్షన్ సమీపంలో నెలివాడ రెవెన్యూ పరిధిలోని ఒక ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన 16 వేల 200 కేజీలు(300పైగా బస్తాలు) పీడీఎస్ బియ్యాన్ని పొట్నూరు అప్పలనాయుడు నిల్వ చేయగా పోలీసులు పట్టుకుని సివిల్ సప్లయిస్ అధికారులకు అప్పగించారు. రేషన్ లబ్ధిదారుల నుంచి రూ.12 నుంచి రూ.14లకు కొనుగోలు చేసి తిరిగి మిల్లర్లకు రూ.15 నుంచి రూ.18 వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

పీడీఎస్ బియ్యం కొనుగోలు చేస్తే కఠిన చర్యలు

పీడీఎస్ బియ్యాన్ని ఎవరైనా వ్యాపారులు కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తప్పవు. కార్డుదారుల నుంచి అక్రమంగా కొనుగోలు చేస్తే దాడులు చేసి పట్టుకుని వాటిని సీజ్ చేయడంతో పాటు 6ఎ కేసులు కూడా నమోదు చేస్తాం.
కె.తిరుపతిరావు,
సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ గజపతినగరం

సీడిగూడలో ఏనుగుల హల్‌చల్



సీడిగూడ పరిసరాల్లో సంచరిస్తున్న ఏనుగులు

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండలంలోని తూర్పుముఠా ప్రాంతం తిత్తిరి పంచాయతీ సీడిగూడ గ్రామంలో నాలుగు ఏనుగులు బుధవారం ఉదయం హల్‌చల్ చేశాయి. వీటి సంచారంతో గిరిజనులు భయాందోళనలు చెందుతున్నారు. కొంత సమయం తరువాత సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లాయి. సీతంపేట, భామిని అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగులు ఒక్కసారిగా తిత్తిరి పంచాయతీలోకి ప్రవేశించి చిరుధాన్యాల పంటలను, జీడి తోటలను నాశనం చేశాయి. ఏనుగుల నుంచి తమను, పంటలను రక్షించాలని గిరిజనులు కోరుతున్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు.